నేతల తల రాత మార్చేది మహిళలే..!

- రెండింటా నారీమణుల ఆధిక్యం
- అందుబాటులోకి ఓటర్ల సవరణ జాబితాలు
- సత్తెనపల్లి డివిజన్ వ్యాప్తంగా 4,52,239 మంది ఓటర్లు
- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం



సత్తెనపల్లి: విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి .. ఇలా ఏ రంగమైన మహిళలదే పై చేయి. ఓటర్ల లోనూ ముందున్నారు. వచ్చే ఎన్నికల్లో నేతల తలరాతను మార్చగలిగే సత్తా మహిళలకే ఉందనడంలో అతిశయోక్తి లేదు. ఇటీవల ఎన్నికల సంఘం నియోజకవర్గాల వారీగా విడుదల చేసిన సమగ్ర ఓటర్ల తుది జాబితా -2023లో గణాంకాలు ఈ విషయాన్నే వెల్లడి చేస్తున్నాయి. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో పురుషుల కన్నా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలు ఉన్నాయి. పెదకూరపాడు నియోజకవర్గంలో పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాలు ఉన్నాయి. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో 540 పోలింగ్ బూత్‌లుండగా 4,52,239 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,21,570 మంది కాగా... మహిళా ఓటర్లు 2,30,627 మంది ఉన్నారు. మొత్తంగా పురుషుల కన్నా మహిళా ఓటర్లు 9,057 మంది అధికంగా ఉన్నారు. ఇతరులు 42 మంది ఉన్నారు. రెండు నియోజకవర్గాల్లోని పట్టణంతో పాటు 9 మండలాల్లోనూ మహిళా ఓటర్లే ముందు వరుసలో ఉండడం గమనార్హం. సత్తెనపల్లి డివిజన్‌లో మండలాల వారీగా పోలింగ్ బూత్‌లు, ఓటర్ల వివరాలు.

పెదకూరపాడు నియోజకవర్గం ఓటర్ల వివరాలు

మండలం పోలింగ్	బూత్‌లు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
పెదకూరపాడు	49	20,053	20,863	08	40,924
అమరావతి	69	28,005	29,867	04	57,876
అచ్చంపేట	61	24,355	25,199	03	49,557
క్రోసూరు	57	23,521	24,209	05	47,735
బెల్లంకొండ	30	12,618	12,841	04	25,463
మొత్తం	266	1,08,552	1,12,979	24	2,21,555

సత్తెనపల్లి నియోజకవర్గం ఓటర్ల వివరాలు

మండలం	పోలింగ్ బూత్‌లు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సత్తెనపల్లి టౌన్	45	22,379	23,786	06	46,171
సత్తెనపల్లి రూరల్	75	28,615	30,071	05	58,691
ముప్పాళ్ళ	44	16,743	17,558	01	34,302
రాజుపాలెం	47	19,885	20,711	03	40,599
నకరికల్లు	63	25,396	25,522	03	50,921
మొత్తం	274	1,13,018	1,17,648	18	2,30,684

జాతీయ ఓటరు దినోత్సవం విజయవంతం చేయాలి



ఎన్నికల కమిషన్, పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటు హక్కు సక్రమ వినియోగం ద్వారా ప్రజా స్వామ్య విలువలను పెంచడం, ఓటరు నమోదు వివరాలను పెంచే ఉద్దేశంలో భాగంగా 'నథింగ్ లైక్ ఓటింగ్, ఓట్ ఫర్ ష్యూర్' నేపథ్యంతో పట్టణం లోని విద్యా కేంద్రం డిగ్రీ కళాశాలలో బుధవారం మధ్యాహ్నం 1.00 గంటలకు 13వ జాతీయ ఓటర్ దినోత్సవం కార్యక్రమం నిర్వహించబడుతుంది. మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకుల, ప్రజలు, స్వయం సహాయక సంఘ గ్రూపులు, అధికారులు, పాల్గొని విజయవంతం చేయాలి.

– కె.నగేష్, తహసీల్దార్, సత్తెనపల్లి.

ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం

- ఉపవిద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు



పోటీలను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు, నిర్వాహకులు

సత్తెనపల్లి: ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని సత్తెనపల్లి ఉపవిద్యాశాఖాధికారి వి.వెంకటేశ్వరరావు అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాల, బాలికల అండర్ -14, అండర్ -17 కరాటే జిల్లా జట్ల ఎంపిక సత్తెనపల్లి ప్రగతి స్కూల్లో మంగళవారం జరిగింది. ఉమ్మడి జిల్లాలైన గుంటూరు, బాపట్ల, పల్నాడు ప్రాంతాల నుండి 150 మందికి పైగా బాల, బాలికలు కరాటే పోటీలకు వారి కరాటే కోచ్ లతో హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు ముఖ్యమేనని, ప్రతి ఒక్కరూ తనను తాను కాపాడుకోడానికి కరాటే ఎంతో ముఖ్యమన్నారు. ప్రగతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ మక్కెన అచ్చయ్య మాట్లాడుతూ సమయస్ఫూర్తిని అలవర్చుకొని క్రీడల్లో రాణించాలని, క్రమశిక్షణతో కూడిన విద్యార్థులు విజయం సాధిస్తారన్నారు. ప్రగతి విద్యాసంస్థల కరస్పాండెంట్ మక్కెన పద్మజ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫిజికల్ డైరెక్టర్ దాసరి కోటేశ్వరరావు, పల్నాడు జిల్లా కరాటే సెక్రెటరీ రామయ్య, సత్తెనపల్లి కరాటే ఫౌండర్ రాంబాబు, బ్లాక్ బెల్ట్ కోచ్ హసీనా (మంగళగిరి), కోచ్ కిరణ్, కేల్ ఇండియా కో ఆర్డినేటర్ లాకు పిచ్చయ్య, ఎర్ర నాగేశ్వరావు (బాపట్ల), ఫిజికల్ డైరెక్టర్ పుచ్చకాయల శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిలో సంక్షేమం..ప్రతి గ్రామంలో అభివృద్ధి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: మూడున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతి ఇంటికి అందిన సంక్షేమ పథకాలు, ప్రతి గ్రామంలో చేసిన అభివృద్ధిని గడప గడపకు వెళ్లి వివరిస్తున్నామని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు పేర్కొన్నారు. మంగళవారం అమరావతి 2వ సచివాలయ పరిధిలో 4వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని మద్దూరు రోడ్డు, బండచేను కాలనీ, ఎస్‌టీ కాలనీల్లో డ్రెయిన్లు, రోడ్ల సమస్యను స్థానికులు ఎమ్మెల్యే శంకరరావు దృష్టికి తీసుకొచ్చారు. అయన వెంటనే.. తన వెంట ఉన్న అధికారులను అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాతయాత్రలో ప్రత్యక్షంగా ప్రజల కష్టాలను చూసి వారి జీవితాలలో మార్పులు తేవడానికి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అమరావతిలో మూడున్నరేళ్లల్లో రూ.26కోట్ల సంక్షేమ పథకాలు, రూ.6కోట్ల అభివృద్ధి పనులు అమలు చేసినట్లు తెలిపారు. 250 గడపలకు తిరిగి లబ్దిదారులకు ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కో-ఆప్షన్ మెంబర్ షేక్ హష్మీ, మండల పార్టీ అధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ పాలపర్తి రాజేశ్వరి ఉప సర్పంచ్ నిమ్మా విజయసాగర్ బాబు, పార్టీ నాయకులు మంగిశెట్టి కోటేశ్వరరావు, అలా లక్ష్మీనారాయణ, నండూరి కరుణకుమార్, శివరామకృష్ణ, పి.రోశిబాబు, నంబూరు బాబురావు, అళ్ల శ్రీనివాసరెడ్డి, భవిరిశెట్టి హనుమంత రావు, చిల్కా సాంబయ్య పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

సంక్షేమ పథకాలతో జీవితాల్లో మార్పులు

పెదకూరపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పేదల జీవితాల్లో మార్పులు వస్తున్నాయని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మంగళవారం మండలంలోని బుస్సాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బుస్సాపురం గ్రామంలో రూ.6.24 కోట్లతో సంక్షేమ పథకాలు, రూ.1.08 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైఎస్ ఎంపీపీ బాషా, మాజీ ఎంపీపీ ఈదా సాంబిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, కంకణాల శివాజీ, మహిళ నాయకులు అల్లం ఇన్నమ్మ, జయమ్మ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్‌కు ఘనసన్మానం



ముప్పాళ్ళ: జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా మండలంలోని నార్నెపాడు గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్ ను మంగళవారం ఘనంగా సన్మానించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేర శతాధిక వృద్ధులను సన్మానించడంలో భాగంగా నార్నెపాడు గ్రామానికి చెందిన పొన్నంకోటయ్య 101 సంవత్సరాలు కావడంతో దుశ్శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. 25వ తేదీన అన్ని గ్రామ పంచాయతీల్లోను కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఇన్‌చార్జ్ ఆర్ఐ కపిల్‌దేవ్, సీనియర్ అసిస్టెంట్ హైమారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అధ్యక్షుడి తీరును నిరసిస్తూ.. బీజేపీ నేతల రాజీనామా..

క్రోసూరు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు వైఖరిని నిరశిస్తూ.. ఆ పార్టీ పల్నాడు జిల్లా మాజీ అధ్యక్షుడు కర్ల అమర సైదారావుతో పాటు పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన 120 మంది పార్టీ నాయకులు.. రాజీనామాలు ప్రకటించారు. మంగళవారం స్థానిక కటకం కల్యాణ మండపంలో బీజేపీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ మేరకు తీర్మానం చేసి రాజీనామాలను రాష్ట్ర బీజేపీ నాయకత్వానికి, కేంద్ర అధ్యక్షుడు నడ్డాకు పంపినట్లు తెలిపారు. సమావేశంలో అమర సైదారావు మాట్లాడుతూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు వైఖరి ఒంటెత్తు పోకడలా, పార్టీకి నష్టం చేకూర్చేలా ఉందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ అధ్యక్షుడు గంధం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారుల సంక్షేమానికి నిధులు ఖర్చు చేయాలి

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ

సత్తెనపల్లి: బడ్జెట్‌లో కేటాయించిన నిధులు వృత్తిదారుల సంక్షేమానికి ఖర్చు చేయాలని, విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం(ఎంబివికె) ఆడిటోరియంలో ఈ నెల 30న జరిగే చేతి వృత్తిదారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో కరపత్రాలు మంగళవారం ఆవిష్కరణ చేశారు. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ సభ్యులు కంచర్ల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా చేతివృత్తుల నుంచి వృత్తిదారులను దూరం చేస్తూ కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తున్నాయని ఆయన విమర్శించారు ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలను వలన చేతివృత్తులన్నీ ధ్వంసం అవుతున్నా యని అన్నారు.కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పథకాన్ని, రాష్ట్రీయ వికాస్ పథకం,బెడ్ పాలక్ బీమా యోజన పథకాలను రద్దు చేసిందన్నారు. సామాజిక,రక్షణ ప్రమాద బీమా అమలు,సబ్సిడీలతో కూడిన రుణాలు మంజూరు చేయుటకు బడ్జెట్లో నిధులు కేటాయించి ఖర్చు చేయాలని కోరుతూ ఈనెల 30న ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ రాఘవయ్య పార్కు ఎదురుగా ఉన్న మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం నందు జరిగే చేతి వృత్తిదారుల రాష్ట్ర సదస్సుకు వృత్తిదారులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా శివ దుర్గారావు, అనుముల వీర బ్రహ్మం, సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, గుంటుపల్లి బాలకృష్ణ, ఎమ్. నాగార్జునలు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలకు విచ్చేస్తున్న.. రాష్ట్ర మంత్రులు, ఎంపీల పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. అచ్చంపేటలో ప్రారంభానికి సిద్ధమైన భవనాలను, బహిరంగ సభ జరిగే ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. రాష్ట్ర మంత్రులు అంబటి రాంబాబు, విడుదల రజనీ, మేరుగ నాగార్జున, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ హెన్రీ క్రిష్టినా బుధవారం ప్రారంభోత్సవానికి రానున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు క్రోసూరు నాలుగు రోడ్ల సెంటర్ నుంచి అచ్చంపేట వరకు భారీ ర్యాలీతో స్వాగతం పలుకనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో రూ.1.85కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనం, 4.15 గంటలకు అచ్చంపేటలో రూ.2.05కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారని ఎమ్మెల్యే చెప్పారు. 4.30గంటలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంపై అవగాహన తప్పనిసరి

సత్తెనపల్లి: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు విద్యార్థి దశ నుంచే అవగాహన తప్పనిసరిగా ఉండాలని అమెరికన్ ఇండియా ఫౌండేషన్ రాష్ట్ర ప్రతినిధి నఫీజ్ అహ్మద్ అన్నారు. పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం క్రియేట్ టు క్లీన్ కార్యక్రమం పై అవగాహన నిర్వహించారు. జిల్లాలోని సుమారు 15 ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు ప్లాస్టిక్ వ్యర్ధాలను తిరిగి ఉపయోగపడే వివిధ నమూనాల ఉపకరణాలను, ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు తమలోని సృజనాత్మకతకు పదును పెడుతూ, ప్లాస్టిక్ వ్యర్థాలు తిరిగి ఎలా ఉపయోగించుకోవచ్చనేది ఉపకరణాలను రూపొందించి ప్రదర్శించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అమెరికన్ ఇండియా ఫౌండేషన్‌కు చెందిన జెరిన్ జాకబ్, జిల్లా కోఆర్డినేటర్ నీలోఫర్, మౌనిక, అశోక్ కుమార్, సుస్మిత, సుగాలి హెచ్‌ఎమ్ నాగరాజా రావ పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలించిన రాష్ట్ర నోడల్ టీం

సత్తెనపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పరిశీలనకు సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామాన్ని రాష్ట్ర నోడల్ టీం మంగళవారం సందర్శించింది. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండు పనులు, 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడు పనులను రాష్ట్ర కోర్ టీం ప్రతినిధి కె.స్వరూప రాణి, క్వాలిటీ కంట్రోల్ ప్రతినిధి నాగరాజు పరిశీలించారు. హార్టికల్చర్, రెవెన్యూ ప్లాంటేషన్, చెరువు, రెండు పంట కాలవ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. అనంతరం పట్టణంలోని మండల కంప్యూటర్ సెంటర్‌లోని మండల రికార్డులను పరిశీలించారు. వారితోపాటు ఏపీఓ పి.వెంకటనారాయణ, సిబ్బంది ఉన్నారు.

ఆడపిల్లలంటే బరువుగా భావించరాదు

జాతీయ బాలిక దినోత్సవం ర్యాలీలు, సమావేశాలు

సత్తెనపల్లి: ఆడపిల్లలంటే బరువుగా భావించరాదని వారిని అన్ని విధాల సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ జీవి సత్యనారాయణ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నుంచి ప్రధాన రహదారిలో ప్రదర్శన చేపట్టారు. అనంతరం మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీఓ సత్యనారాయణ మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన దుర్ఘటనను దృష్టిలో పెట్టుకుని దిశ చట్టంతో పాటు ప్రత్యేక పోలీస్ స్టేషన్లు ఏర్పాటు, గ్రామ సచివాలయాల్లో మహిళా పోలీసులను నియామకం చేపట్టిందన్నారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మహిళలు, బాలికలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలు ఉన్నతమైన చదువులు చదవాలి

రాజుపాలెం: ఆడ పిల్లలు ఉన్నతమైన చదువులు చదివి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి తెలిపారు. రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బాలికలకు అవగాహన సమావేశాన్ని ఎంఈఓ మల్లికార్జునశర్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బాలికలకు ఏ చిన్న సమస్య వచ్చిన వెంటనే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు చెప్పుకోవాలని సూచించారు. సమాజంలో ధైర్యంగా తిరగాలని సూచించారు. పాఠశాలలో సమస్యల బాక్సును ఏర్పాటు చేశామని ఏ సమస్య వచ్చిన వెంటనే రాసి బాక్సులో వేయాలని సూచించారు.

నేటి బాలికలే రేపటి సమాజ నిర్మాతలు

ముప్పాళ్ళ: నేటి బాలికలే రేపటి సమాజ నిర్మాతలని, ఆడపిల్ల మన సంస్కృతిలో భాగమని ఆడపిల్లను గౌరవిస్తే అమ్మను గౌరవించినట్లేనని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు ఎమ్. జీవనజ్యోతి చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయబాలిక దినోత్సవంలో భాగంగా ర్యాలీ, మానవహారం మంగళవారం నిర్వహించారు. ప్రతి స్త్రీలో అమ్మను చూడాలన్నారు. కార్యక్రమంలో మాదల హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్, అంగన్‌వాడీకార్యకర్తలు కె.శాంతి, పి.మల్లీశ్వరి,వి.రాజ్యలక్ష్మి, ఎమ్. పద్మావతి, ఎమ్.రాజ్యలక్ష్మీ, టి.సుధారాణి, ఎల్.అన్నపూర్ణ, ఎమ్.వీరమ్మ, వీరకుమారి, డీ.అంజమ్మ, మహిళా పోలీసు కె.పుష్పవాణి పాల్గొన్నారు.



జాతీయ బాలికా దినోత్సవ రూపకంలో స్థానిక కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థినుల ప్రదర్శన

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

నకరికల్లు: విద్యార్థి దశనుంచే పోటీతత్వం, కృషి, పట్టుదల అలవర్చుకుంటే అన్నిరంగాల్లోను రాణించవచ్చని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం బాలికావిద్యకోసం, వారి అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తోందని అన్నారు. డాక్టర్ వి.శ్రీనునాయక్, ప్రధానోపాధ్యాయురాలు కె.రంగారావు, కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమీజున్, కార్యదర్శి అరుణప్రియ, మహిళాపోలీస్ షేక్.రషీదా, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

అచ్చంపేట: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని హెచ్ఎం వి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 75 త్యాళ్లూరి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గుడేటి నాగరత్నమ్మ, షేక్ రహిమున్నిసా ఆధ్వర్యంలో బాలికల రక్షణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు.



అచ్చంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

క్రోసూరులో: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గుడ్‌షెపర్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో పి.శివరామయ్య పాల్గొని మాట్లాడారు. జెడ్పీ పాఠశాల బాలికలతో ర్యాలీ నిర్వహించారు. అమరావతి గుడ్‌షెపర్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పోలీసుస్టేషన్ వద్ద ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ తో కలిసి జాతీయ బాలికా దినోత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

అసమానతలు దూరం చేసేలా అవగాహన కావాలి

పెదకూరపాడు: బాలురు, బాలికల మధ్య అసమానతలను దూరం చేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి ప్రసాదరావు అన్నారు. స్థానిక 75 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అమరావతిలో: స్థానిక డాక్టర్ బీఅర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా డిక్షనరీలు పంపిణీ చేశారు. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెని విశ్రాంత రీజినల్ మేనేజర్ యాదల బాలయ్య డిక్షనరీలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ పద్మజ, ఎంఈఓ మేడా శ్రీనివాసరావు, మండల ఈవోపీఆర్డీ ప్రసాదరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లంకొండలో: బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి,అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపీడీవో వెంకటరెడ్డి కోరారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని మంగళవారం నందిరాజుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. బాలికల హక్కులపై విద్యార్థులకు అవగహన కల్పించారు.

క్లుప్తంగా

ఎల్ఐసి ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం



మాట్లాడుతున్న మంచాల రమేష్

సత్తెనపల్లి: ఎల్ఐసి ని ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడానికి ఆలోచనలు చేస్తోందని, దానిని అందరూ కలిసి కట్టుగా వ్యతిరేకిద్దామని సత్తెనపల్లి బ్రాంచి లియాఫి ప్రెసిడెంట్ మంచాల రమేష్ పిలుపునిచ్చారు.78 వ ఎల్ఐసి ఏజెంట్స్ వృత్తి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో లియాఫీ అధ్యక్షుడు మంచాల రమేష్ అధ్యక్షత న సమావేశం జరిగినది. సత్తెనపల్లి బ్రాంచిలో ఉన్న ఏజెంట్ మిత్రులు ,మహిళా ఏజెంట్స్ పెద్ద ఎత్తున పాల్గొని ఈ ఏపీపీ డే నిర్వహించారు. ఏజెంట్స్ వృత్తిలో సాధించిన విజయాలు, సాధించ వలసిన డిమాండ్స్ పై చర్చించు కోవటానికి ఒక వేదికగా లియాఫీ వుంటుందన్నారు. సమావేశంలో లియాఫీ సెక్రెటరీ కె రామబ్రహ్మాచారి,ట్రెజరర్ పి జగన్నాథం, చైర్మన్ ఎస్.వెంకటేశ్వర్లు, డివిజన్ జాయింట్ సెక్రెటరీ డి.కోటేశ్వర రావు , కె విష్ణువర్ధనరావు, ఎస్.కె ఖాసీంవలి, సివి కృష్ణా రెడ్డి, సీహెచ్ సాంబశివరావు కె. విజయశ్రీ, బి నాగమణి, తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు

నకరికల్లు: నిరుద్యోగ యువతీయువకులకు ఉచితంగా శిక్షణనిచ్చి ఉద్యోగ అవకాశాలు కలిపిస్తున్నట్లు ఏపీఎం సునీత మంగళవారం తెలిపారు. 18 నుంచి 35ఏళ్లలోపు వయస్సు కలిగిన యువతీయువకులకు నరసరావుపేట సమీపంలోని టీటీడీసీ కోటప్పకొండలో సూపర్ వైజర్-సైట్ ఈహెచ్ఎస్ కోర్సులో నాలుగునెలల పాటు వసతి, భోజనంతో కూడిన ఉచిత శిక్షణనిస్తారన్నారు. నూరుశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉన్నందున నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు : 9908482907 నంబరును సంప్రదించాలన్నారు.

44 మందికి వైద్య పరీక్షలు

రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెం పునరావస కేంద్రంలో ఫ్యామిలీ డాక్టర్ మంగళవారం వైద్య సేవలు అందించారు. డాక్టర్ రవి తేజనాయక్ 44 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వీరిలో 16 మందికి బీపీ, 15 మందికి షుగర్ మందులు నెలకు సరిపడ అందించారు. అనంతరం సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంనకు, మండల పరిషత పాఠశాలలకు వెళ్లి పిల్లలకు వైద్య పరీఓలు నిర్వహించారు. మంచానికి పరిమితమైన వారి ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్ దేవానాయక్, ఏఎన్ఎంలు ప్రమీల, సుబ్బారెడ్డి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ప్రతిష్ట మహోత్సవం

పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్ళూరు ఆయోధ్యస్వామి ఆశ్రమంలో మంగళవారం దేవతమూర్తుల విగ్రహా ప్రతిష్ట మహోత్సవం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వేద పండితులు పరుచూరి శ్రీనివాసాచార్యులు, శ్రీపతి బాలకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో యాగశాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి గిరి ప్రదరక్షణ చేశారు. ఆశ్రమం నందు అమోధ్యస్వామి, దత్తాత్రేయ, సాయి బాబా విగ్రహాలను ప్రతిష్టించారు.

రైతు భరోసా కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీలు



కంభంపాడులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

పెదకూరపాడు: మండలంలోని కంభంపాడు, కాశిపాడు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కె.నాగమల్లేశ్వరరావు, సబ్‌ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య, ఎఫ్ఆర్ఓ షేక్ సైదులు తనిఖీ చేశారు. రైతులకు అందుతున సేవలను పరిశీలించారు. వ్యవసాయశాఖ ద్వారా అందే సేవలను, వివిధ పథకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖాధికారి శాంతి, విస్తరణ అధికారి శేషుబాబు, గ్రామ సహాయకులు సాయి, ప్రసన్న కుమార్, చిన్నబాబులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సోషల్ స్టడీస్ మెటీరియల్ పంపిణీ

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవతరగతి విద్యార్థులకు హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోషల్‌స్టడీస్ మెటీరియల్‌ను మంగళవారం పంపిణీ చేశారు. జాతీయబాలిక దినోత్సవంలో భాగంగా గ్రామ సచివాలయ సంరక్షణ కార్యదర్శి పి.ఆశాలత సహకారంతో విద్యార్థులకు పంపిణీ చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కె.బుల్లిబాబు చెప్పారు. లక్ష్యాన్ని ఎంచుకుని సాధన చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.మిరియమ్మ చెప్పారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా నా క్లయింటు అయిన పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం, సత్తెనపల్లి పట్టణ నివాసి అయిన చెన్నపరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, తండ్రి వెంకటేశ్వరరెడ్డి నుండి సమాచారం పొంది ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూల్ దాఖాలా స్థిరాస్తి పెర్ల కుసుమకుమారి, భర్త కృష్ణమూర్తి గారి దనీస్సీ సదరు పెర్ల కుసుమకుమారి గారు ది.26.05.1966వ తేదిన దోకిన సరస్వతమ్మ భర్త వెంకటరాయుడు వద్ల నుంచి పొంది సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నందు దస్తావేజు నెంబర్. 3330/1966 య.1 00సెంట్ల భూమి రిజిస్టర్ జరిగియున్నదనీస్సీ, సదరు రిజిస్టర్ అయిన నాటి నుండి ఈ దిగువ షెడ్యూల్ దాఖాలా స్థిరాస్తి పెర్ల కుసుమకుమారి అనుభవిస్తున్నదనీస్సీ సదరు పెర్ల కుసుమకుమారి ది.28.04.1978వ తేదీన ఈ దిగువ తెలిపిన షెడ్యూల్‌లో య.0 56 సెంట్ల భూమిని తిరుక్కోట్ల హనుమంతరావుకు పై తెలిపిన తేదిన సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విక్రయ దస్తావేజు నెంబర్ 268/1978గా వ్రాయించియున్నా దనీస్సీ, అది పోనూ మిగిలిన య.0-44 సెంట్ల భూమి సదరు పెర్ల కుసుమకుమారి గారి స్వాధీన అధీన అనుభవంలో ఉన్నదనీస్సీ, దరిమిలా ఈ దిగువ షెడ్యూల్ దాఖాలా స్థిరాస్తిని నా క్లయింటు కొనుగోలు చేయాలని తలంచినారనీస్సీ, అందుకు ముందు ఈ దిగువ షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైన ఎటువంటి అభ్యంతరాలుగానీ, ఏమైన క్లెయిమ్‌లుగానీ ఉన్న ఎడల నా క్లయింటుకుగానీ లేదా నాకు స్వయంగా గానీ 07 (ఏడు) రోజుల లోపు స్వయంగానీ లేక న్యాయవాది ద్వారా గానీ తెలియచేయవలసిందిగా తెలియపరచడమైనది. లేనిచో ఈ దిగువ షెడ్యూల్ దాఖాలా స్థిరాస్తిపై ఎటువంటి అభ్యంతరాలు లేవనీ తలంచి సదరు ఆస్తి నిస్సిక్తమైనదిగా భావించి సదరు నా క్లయింటు కొనుగోలు చేయుదురనీస్సి ఇందుమూలంగా తెలియపరచడమైనది.

Descriprion of the schedule property

Palnadu District- Narasaraopet Registrarion District - Sattenapalli Sub-registrar office- Sattenapalli Mandal- Sattenapalli Municipal Limits- Vaddavalli Grama D.No. 125-out of an extent of Ac.5-48 cents- which is an extent of Ac. 0-44 cents vacant bounded by: **East**: Site Belongs to Kondaveeti Koteswara Rao, **South**: Perla Kusumakumari remaining site, **West**: Bazaar, **North**: Site Belongs to Akkala Venkata Reddy, Within the above boundaries an extent of Ac. 0-44 cents vacant site.

తేది: 24-01-2023

నల్లిబోయిన ఆంజనేయులు, న్యాయవాది
సత్తెనపల్లి, పల్నాడు జిల్లా. సెల్: 9966808058